
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 4 మే 2025



చకచకా

వేగంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులు

- గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోనే రాజ్‌భవన్ నిర్మాణం
- గవర్నర్‌తో మంత్రి నారాయణ చర్చలు
- ఐకానిక్ భవనాల ఇంటర్నల్ డిజైన్లపైనా ప్రతిపాదనలు
- నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్లు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో సమావేశం

అమరావతి పునర్నిర్మాణానికి ఇలా ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారో లేదో.. అలా పనులు పురోగతిలోకి వస్తున్నాయి. తాజాగా గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోనే రాజ్‌భవన్ నిర్మించాలని నిర్ణయించడం, వాటికి సంబంధించిన డిజైన్లపై గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మంత్రి నారాయణ చర్చించడం, ఐకానిక్ భవనాలైన హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ టవర్ల ఇంటర్నల్ డిజైన్లపై నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్లు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో సమావేశం కావడంతో పనులు త్వరలోనే ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.





అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష, (ఇన్‌సెట్‌లో) నార్మన్ ఫోస్టర్స్, ఎల్ అండ్ టీ ప్రతినిధులతో కలిసి డిజైన్ల పరిశీలన

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ) పరిధిలోనే రాజ్‌భవన్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌భవన్ డిజైన్ ఎలా ఉండాలన్న దానిపై శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ కలిసి చర్చించారు. రాజ్‌భవన్ ఎలా ఉండాలి? ఆర్కిటెక్చరల్ డిజైన్ ఎలా ఉంటే బాగుంటుంది? ఇంటీరియర్ స్ట్రక్చర్ ఎలా ఉండాలి? ఎన్ని రూములు ఏర్పాటు చేయాలి? సిబ్బంది ఎంతమంది ఉంటారు ? సమావేశాలకు, ఇతర అవసరాలకు అనుగుణంగా ఏమేం ఏర్పాటు చేయాలి? ఓపెన్ ఏరియా, గార్డెన్ వంటి సదుపాయాలకు సంబంధించి గవర్నర్ నుంచి మంత్రి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా కొన్ని సూచనలు చేసినట్టు సమాచారం.

ఐకానిక్ భవనాల ఇంటర్నల్ డిజైన్లపై చర్చ

రాజధాని అమరావతిలో తలపెడుతున్న ఐకానిక్ భవనాలైన హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ టవర్ల ఇంటర్నల్ డిజైన్లు ఎలా ఉండాలన్న దానిపై శనివారం మంత్రి నారాయణ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్‌అండ్‌టీ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఐదు ఐకానిక్ టవర్లు, హైకోర్టు, అసెంబ్లీ భవనాల్లో ఇంటర్నల్ డిజైన్లు ఎలా ఉండాలన్న దానిపైనా ఈ సమావేశం సాగింది. హైకోర్టు కాంప్లెక్స్‌లో ఎన్ని గదులు ఉండాలి? ఆర్కిటెక్చర్ ఎలా ఉండాలన్న దానిపై చర్చించారు. ఇంతకుముందే మంత్రి నారాయణ హైకోర్టు సీజేతో హైకోర్టు కాంప్లెక్స్‌కు సంబంధించి చర్చించారు. హైకోర్టు కాంప్లెక్స్‌లో 40 గదులు వస్తాయని మంత్రి నారాయణ చెప్పినపుడు, 52 గదులు కావాలని సీజే సూచించినట్టు సమాచారం. డిజైన్‌ను బట్టి అన్ని గదులు కష్టమని మంత్రి నారాయణ చెప్పగా, 48 గదులు కచ్చితంగా ఉండాలని సీజే చెప్పారని తెలుస్తోంది. సీజే వ్యక్తపరిచిన విధంగా హైకోర్టు కాంప్లెక్స్‌లో చేపట్టాల్సిన ఇంటర్నల్ డిజైన్లు రూమ్స్‌పై నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

టవర్‌లోకి అనుమతిపై మంతనాలు

హైకోర్టు కాంప్లెక్స్‌పై సందర్శకుల కోసం టవర్ ఏర్పాటు ఉంటుంది. ఈ టవర్‌లోకి సందర్శకులకు అనుమతి ఉంటుంది కాబట్టి.. ఎంతవరకు వారికి భద్రత ఇవ్వాలి? ఎంత ఎత్తు వరకు సందర్శకులను అనుమతించవచ్చు? టవర్ ఎక్కటానికి ఎలివేటర్స్ ఎంతమేర ఏర్పాటు చేయాలి? వంటి అంశాలను చర్చించారు. అసెంబ్లీ భవనంలో అసెంబ్లీ, మండలితో పాటు లోపల ఎన్ని రూములు ఏర్పాటు చేయాలి? సమావేశ మందిరాలు, ఆర్కిటెక్చరల్ డిజైన్లు ఎలా ఉండాలి? ఎంతమంది సిబ్బంది ఉన్నారు? ఆయా సిబ్బందికి అనుగుణంగా విభాగాలను ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై చర్చించారు. సచివాలయ టవర్లకు సంబంధించి కూడా శాఖలు, సిబ్బందికి అనుగుణంగా లోపల భాగాన్ని ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై చర్చలు సాగాయి.

ఆ సార్ ఆఫీసులో చాలా స్ట్రిక్ట్. ఆఫీసు పూర్తయ్యాక మాత్రం చాలా సిల్లీ. సరసాలు ఆడటంలో ఆయనకు సాటే లేరు. ఏకంగా పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) డివిజనల్ కార్యాలయంలోనే దుకాణం తెరిచిన ఘనుడు. రోజూ ఆఫీసు మూసివేసిన తర్వాత ఓ మహిళను వెంటబెట్టుకుని వచ్చి కార్యాలయ తాళాలు తెరిచి ఏకాంత వ్యవహారాలు వెలగబెడుతున్నాడు. సార్ కార్యకలాపాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడం, వారు విచారణకు ఆదేశించడం, సీసీ ఫుటేజీలో అడ్డంగా దొరికిపోవడంతో ఏపీటీడీసీలోని ఈ కీలక ఉద్యోగి బాగోతం మరోసారి బట్టబయలైంది.

సరసాల సార్..!

ఏపీటీడీసీలోని కీలక ఉద్యోగి రాసలీలలు

- డివిజనల్ కార్యాలయంలోనే కార్యకలాపాలు
- ఆఫీసు మూసివేశాక ఓ మహిళతో ప్రవేశం
- తాళాలు తెరిచి ఏకాంత వ్యవహారాలు
- సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదుతో వెలుగులోకి..
- సీసీ ఫుటేజీ ద్వారా బండారం బట్టబయలు
- విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు
- గతంలో హరిత బెర్మ్‌పార్కులోనూ ఇంతే..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఏపీటీడీసీ డివిజనల్ కార్యాలయంలోని కీలక విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగి ఆయన. రోజూ రాత్రిపూట తన ద్విచక్రవాహనంపై ఓ మహిళను వెంటబెట్టుకుని కార్యాలయానికి వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. కలెక్టరేట్‌కు అభిముఖంగా, బందరురోడ్డు వెంబడి లైలా కాంప్లెక్స్ ఉంది. ఈ కాంప్లెక్స్ దిగువన ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ కార్యాలయం, కమర్షియల్ విభాగాలు ఉన్నాయి. ఈ భవనం మల్టీప్లెక్స్ కావటంతో బయట పెద్దపెద్ద గేట్లు ఉంటాయి. సెక్యూరిటీ కూడా ఉంటుంది. పర్యాటకాభివృద్ధి సంస్థ ఉద్యోగి కావటంతో సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం చెప్పే పరిస్థితి లేదు. దీంతో ఆయన రోజూ రెచ్చిపోతున్నారు. రాత్రి సమయంలో ఓ మహిళను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వస్తుండటంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది విషయాన్ని ఏపీటీడీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అసలేం జరుగుతుందో తెలుసుకోవటానికి అధికారులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. దీంతో సదరు ఉద్యోగి అడ్డంగా దొరికిపోయారు. రోజూ రాత్రి 7-8 గంటల మధ్యలో తన బైకుపై ఓ మహిళను తీసుకురావటం సీసీ కెమెరాల ద్వారా రికార్డైంది. బైక్ పార్కు చేసి ఆమెను లోపలికి తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. కార్యాలయం తాళం తెరిచి, ఆ మహిళను లోపలికి తీసుకెళ్లి తిరిగి తలుపులు వేయడం, అరగంట తర్వాత బయటకు వచ్చి బైక్‌పై వెళ్లిన ఆధారాలను సీసీ ఫుటేజీ ద్వారా సేకరించారు.

గతంలోనూ ఇంతే.. అయినా చర్యలు శూన్యం

ఈ ఉద్యోగి కామక్రీడలు ఇంతకుముందు కూడా జరిగాయి. హరిత బెర్మ్‌పార్క్‌లోని స్టాఫ్ రూమ్‌లో కూడా చాలాకాలం ఈయన కార్యకలాపాలు సాగించారు. పార్క్‌లో వాకింగ్ చేయటానికి వచ్చిన మహిళను తరచూ స్టాఫ్‌రూమ్‌లోకి తీసుకెళ్లేవాడు. సిబ్బందిని బయటకు పంపేసి రాసలీలలు సాగించేవాడు. దీంతో సిబ్బందే వలపన్ని సదరు సార్.. లీలలను బయట పెట్టారు. ఏసీ పైపుల రంధ్రానికి సీక్రెట్ కెమెరా పెట్టి మరీ ఈ విషయాన్ని సిబ్బందే వెలుగులోకి తెచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. కానీ, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా ఏకంగా డివిజనల్ కార్యాలయంలోనే ఇలాంటి పనులు చేస్తుండటంతో అధికారులు విచారణకు ఆదేశించారు. కాగా, సదరు మహిళతో సన్నిహితంగా ఉన్న ఫొటో ఆయన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకోవడంతో ఆయన రాసలీలలను ఆయనే బయట పెట్టుకున్నట్టు అయ్యింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై విచారణ జరుగుతోంది.

కొత్త వాహనాల బ్యాటరీలు మాయం

ఎక్సెల్ ప్లాంట్‌లో కార్పొరేషన్ ఉద్యోగుల చేతివాటం

దొంగలు దొరికినా చర్యలకు మీనమేషాలు



ఉద్యోగుల నుంచి స్వాధీనం చేసుకున్న బ్యాటరీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లో నిలుపుదల చేసిన చెత్త తరలింపు లారీల బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. సీసీ కెమెరాల ద్వారా వీటిని దొంగిలించింది కార్పొరేషన్ ఉద్యోగులేనని తెలుసుకున్నప్పటికీ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని చెత్తను ఇతర ప్రాంతాలకు తరలించటం కోసం ఓ ప్రముఖ కంపెనీకి చెందిన పది చక్రాల టిప్పర్లను కార్పొరేషన్ కొనుగోలు చేయాలని నిర్ణయించింది. నగరంలోని వందలాది మెట్రిక్ టన్నుల చెత్తను గుంటూరులోని జిందాల్ ఫ్యాక్టరీకి తరలించేందుకు వీలుగా వీటిని ఉపయోగించాలని నిర్ణయించింది. కాగా, ఒప్పందం ప్రకారం సదరు సంస్థ మిగతా 6లో..



ఎయిర్‌పోర్టును కమ్మేసిన పొగ

గన్నవరం విమానాశ్రయంలో మంటలపై దర్యాప్తు

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : రాజధాని పునః ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం రాగా, ఆయన వస్తున్న విమానం గన్నవరం విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న సమయంలో ఎగసిపడిన మంటలపై ఎయిర్‌పోర్ట్ అధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. మోదీ విమానం ల్యాండింగ్ సమయంలో భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ మంటలు అజ్జంపూడి గ్రామం వైపు నుంచి రాగా, ఎయిర్‌పోర్టును భారీ పొగ కమ్మేసింది. ప్రహరీవైపు నుంచి పొగలు, అక్కడి ఖాళీ ప్రదేశంలో మంటలు చెలరేగినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్న ఎయిర్‌పోర్టు ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు.

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేడు నగరంలో 28 కేంద్రాల్లో పరీక్ష
- మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో అధికారులకు ప్రత్యేక శిక్షణ

6లో

సజావుగా గ్రూప్1 పరీక్ష

- తొలిరోజు 1,801 మంది అభ్యర్థులకు 1,161 మంది హాజరు
- ఈ నెల 9 వరకు నిర్వహణ

ఇంటి దొంగలు..!

గృహనిర్మాణ శాఖలో అవినీతి ఉద్యోగులపై వేటు

రూ.39 లక్షల విలువైన సిమెంట్, ఇనుము మాయం

- అవనిగడ్డలోని ఇద్దరు ఏఈల శాశ్వత తొలగింపు
- క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని నిర్ణయం
- అవనిగడ్డ డీఈపై శాఖాపరమైన విచారణకు ఆదేశాలు
- చల్లపల్లి, ఘంటసాల మండలాల గోడౌన్ ఇన్‌చార్జి సస్పెన్షన్
- విధులకు దూరంగా మోపిదేవి మండల ఏఈ
- అక్రమాలు రుజువైన ఏడాదికి కలెక్టర్ చర్యలు

సిమెంట్, ఇసుక, ఇనుమును పప్పుబెల్లాల్లా పంచుకున్నారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందించిన మెటీరియల్‌ను ఇష్టానుసారంగా దారి మళ్లించారు. జిల్లాలోని గృహనిర్మాణ శాఖలోని కొందరు ఏఈలు, డీఈలు సాగించిన ఈ అవినీతి బాగోతాలపై వెల్లువలా ఫిర్యాదులు అందడం, నిజాలు నిర్ధారణ కావడంతో అవనిగడ్డ నియోజకవర్గంలో గతంలో పనిచేసిన హౌసింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీచేశారు. చల్లపల్లి మండలం గృహనిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ఏఈగా పనిచేసిన అరుణకుమారి, వినయ్‌చంద్రను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని ఉత్తర్వులు జారీచేశారు. అవనిగడ్డ నియోజకవర్గ డీఈగా పనిచేసిన బానోజీరావుపై శాఖాపరమైన విచారణతో పాటు ముదినేపల్లి మండల ఏఈ వై.శేషగిరిరావును సైతం సస్పెండ్ చేశారు. ఈ మొత్తం అవినీతి వ్యవహారంలో రూ.39 లక్షల మేర దారి మళ్లిందని నిర్ధారణైంది.

మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : అవనిగడ్డ నియోజకవర్గంలోని అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో గృహనిర్మాణ శాఖలో పనిచేసిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లు తమ చిత్తానుసారం వ్యవహరించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించకుండానే ముందస్తుగా లబ్ధిదారులకు సిమెంట్, ఇనుము, ఇసుక వంటి మెటీరియల్ ఇచ్చినట్టుగా రికార్డుల్లో రాసి, వాటిని పక్కదారి పట్టించి విక్రయించేశారు. ఈ నాలుగు మండలాల్లో గృహనిర్మాణ శాఖలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసిన ఏఈలు తమదైనశైలిలో అక్రమాలకు పాల్పడటంతో ఉన్నతాధికారులకు విడతలవారీగా గతంలోనే ఫిర్యాదులు అందాయి. గృహనిర్మాణ శాఖ, విజిలెన్స్ అధికారులు విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక బయటకు మిగతా 6లో..



మోపిదేవి మండల ఏఈ డుమ్మా

మోపిదేవి మండలంలో తాండవ కృష్ణ అనే ఏఈ పనిచేశారు. గతంలో ఈ ఏఈ అవనిగడ్డ మండలం గృహనిర్మాణ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మోపిదేవి మండలం ఏఈగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. మోపిదేవి, కోసూరివారిపాలెం గ్రామాల్లో గిరిజనుల ఇళ్లను ఈ ఏఈనే కాంట్రాక్టు తీసుకుని నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇళ్లు సరిగ్గా నిర్మించకపోవడంతో పాటు రెండువేల టన్నుల ఇసుకను మాయం చేసిన కృష్ణను మచిలీపట్నంలోని జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు. తనపై చర్యలు తప్పవని నిర్ధారణకు వచ్చిన ఈయన చాలాకాలంగా విధులకు హాజరుకావట్లేదు.

విచారణ ఎప్పటికో..!

జలవనరుల శాఖలో ఏఈపై అంతర్గత విచారణ

- ఆర్సీ డివిజన్‌లో అక్రమాలపై ఫిర్యాదులు
- రెండు నెలలుగా ముందుకు సాగని విచారణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జలవనరుల శాఖలో ఆయనో ఇంజనీర్. అవనిగడ్డ నియోజకవర్గమే ఆయన కేంద్రం. ఉద్యోగంలో చేరింది మొదలు ఇప్పటి వరకు సర్వీసులో ఎక్కువకాలం ఆ నియోజకవర్గంలో ఉన్న సబ్ డివిజన్లలో విధులు నిర్వర్తించారు. దీంతో ఆయన సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. ఇంకేముంది వరుస అక్రమాలు మొదలయ్యాయి. నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఏ పార్టీ వ్యక్తి ఉన్నా సదరు ఇంజనీర్‌నే కోరుకుంటారు. ప్రస్తుతం ఈ అసిస్టెంట్ ఇంజనీర్ అక్రమాల చిట్టా ఉన్నతాధికారులకు చేరడంతో అంతర్గత విచారణకు ఆదేశించారు. అయితే, విచారణ ముందుకు సాగకపోవడం ఇప్పుడు జలవనరుల శాఖలో చర్చనీయాంశంగా మారింది. మూడు నెలలుగా విచారణ ఇంకా సాగుతూనే ఉంది. ఆ ఏఈపై సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఫిబ్రవరిలో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాల ప్రకారం అడుగులు వేయడానికి జిల్లా జలవనరుల శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

కట్టలపై అనధికార తూములు

కాల్వలపై కట్టలు బలహీనపడుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. భారీగా వర్షాలు కురిసినప్పుడు కట్టల పరిస్థితి దారుణంగా ఉంటోందని ఇప్పటికే పలువురు రైతులు అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు. ఈ ఏఈ పనిచేసిన ప్రతి సెక్షన్‌లోనూ కరకట్టలపై అనధికారికంగా తూములు ఏర్పాటు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ అధికారి విషయంలో అధికార, ప్రతిపక్ష నేతలు ఒకేమాట మీద ఉంటారంటే ఆయన పరపతి ఏమిటో అర్థమవుతుంది.

ఉన్నతాధికారులకు తెలియకుండా చెక్ పవర్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. కొత్త పాలకవర్గాలు ఏర్పడ్డాయి. అప్పటి వరకు ఆయా సబ్ డివిజన్లలో నీటి సంఘాలకు వచ్చే నిధులు, రైతులు చెల్లించే పన్నులను జమచేసే బ్యాంకు ఖాతాలకు సంబంధించిన పుస్తకాలు సంబంధిత ఇంజనీర్ల ఆధీనంలో ఉండేవి. వాటికి కాంపిటెంట్ అథారిటీగా జలవనరుల శాఖ ఎస్ఈ ఉండేవారు. ప్రాజెక్టు కమిటీలు ఎన్నికైన తర్వాత మినిట్స్ బుక్, బ్యాంక్ ఖాతాల పాస్‌బుక్‌లు, నగదు.. పాలకవర్గ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ వద్ద ఉండాలి. అప్పటి వరకు అధికారులు నిర్వహించిన ఈ వ్యవహారాలను ఇక నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ నిర్వహిస్తారని సంబంధిత బ్యాంక్‌కు అధికారికంగా లేఖ ఇవ్వాలి. బ్యాంక్ ఖాతాలు ఛైర్మన్, మిగతా 6లో..

---

6 నుంచి దుర్గగుడి ఘాట్‌రోడ్డు మూత

ఇంద్రకీలాద్రి, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొండ ప్రాంతానికి మెస్ వేసి రక్షణ చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఘాట్‌రోడ్డుపై రాకపోకలను నిషేధిస్తున్నట్లు దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రూట్‌లో వచ్చే భక్తులు షన్నమిఘాట్ వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అక్కడి నుంచి దేవస్థానం ఏర్పాటుచేసిన బస్సుల్లో కొండపైకి చేరుకోవాలని సూచించారు. చెన్నై, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వీఎంసీ కార్యాలయం సమీపంలోని సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న హోల్డింగ్ ఏరియాలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అక్కడి నుంచి దేవస్థాన బస్సుల్లో ఆలయానికి చేరుకోవాలని పేర్కొన్నారు. కనకదుర్గానగర్‌వైపు ఉన్న మార్గం ద్వారానే భక్తులు కొండపైకి చేరుకోవాలని, మూడు రోజుల పాటు పార్కింగ్ ప్రదేశాల నుంచి భక్తులకు ఉచిత రవాణా సదుపాయం ఉంటుందని ఆయన వివరించారు.

వల్లభనేని వంశీకి అనారోగ్యం

- ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జిల్లాజైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శనివారం అనారోగ్యానికి గురయ్యారు. దీంతో జైలు అధికారులు ఆయన్ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన కాళ్లకు వాపులు రావడం, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని ఆర్ఎంవో చాంబర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు వైద్యులు ఎకో 2డీ, ఈసీజీ, బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేశారు. సుమారు రెండు గంటలపాటు ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆయనకు వెన్నెముక నొప్పి ఉంది. బీపీ, షుగర్‌కు సంబంధించి వైద్యులు రాసిచ్చిన మందులు కాకుండా వేరే మందులు వాడటంతో కాళ్లకు వాపులు వచ్చినట్టుగా వైద్యులు అనుమానిస్తున్నారు.

ఆసుపత్రి నుంచి రంగా డిశ్చార్జి

జైలు నుంచి వల్లభనేని వంశీ ఆసుపత్రికి రావడానికి ముందు ఆయన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగా డిశ్చార్జి అయ్యారు. షుగర్ తగ్గిపోవడంతో రెండు రోజుల క్రితం రంగా అనారోగ్యం బారిన పడ్డారు. ఆయన్ను జైలు అధికారులు ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో వైద్యులు అడ్మిషన్ ఇచ్చారు. తిరిగి శనివారం డిశ్చార్జి చేయడంతో జిల్లా జైలుకు తరలించారు.

15 నుంచి బీచ్ ఫెస్టివల్

- వినూత్నంగా నిర్వహిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

6లో

15 నుంచి బీచ్ ఫెస్టివల్

● వినూత్నంగా నిర్వహిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌ను వినూత్న రీతిలో నిర్వహిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో అధికారులతో బీచ్ ఫెస్టివల్‌పై ఆయన చర్చించారు. ఫుడ్‌కోర్టులు, పార్కింగ్ ఏర్పాటు, జలక్రీడలు, వినోద క్రీడలు, బీచ్ కబడ్డీ, బోట్ రేస్ తదితర అంశాలపై కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, మెప్మా పీడీ సాయిబాబు, వివిధ శాఖల అధికారులతో ఆయన చర్చించారు. 2018లో నిర్వహించిన బీచ్ ఫెస్టివల్‌లో లక్షలాది మంది పాల్గొన్నారని తెలిపారు. యువతకు మధురమైన అనుభూతులు మిగిల్చేలా బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు, కళాకారులకు భోజన, వసతి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగినపూడిబీచ్‌కు కబడ్డీ ఆడేందుకు జాతీయ క్రీడాకారులు వస్తున్నారని, వీరందరికీ వసతి సదుపాయాలు కల్పించడంపై హోటల్ యజమానులతో మాట్లాడామన్నారు. లక్షలాది పర్యాటకులు వస్తున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూస్తామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు.

'పునఃప్రారంభం' సభతో

నవ్యాంధ్ర నవశకానికి నాంది

● టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, మే 3(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీ ఇచ్చిన హామీలతో అమరావతి రాజధాని పునఃప్రారంభం సభ ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలకు ఊపిరులు ఊదింది. నవ్యాంధ్రలో నవశకానికి నాంది పలికింది.' అని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. శనివారం అమరావతి సభ విజయవంతంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని, భవిష్యత్‌పై ఎన్నో అంచనాలు కల్పించిందని ఆయన తెలిపారు. ఐదేళ్లలో నిర్వీర్యమైన రాజధానికి పదే పది నెలల్లో రూపురేఖలు తెచ్చి, ప్రధాని మోదీతో పునఃశంకుస్థాపన, రూ.60 వేల కోట్లతో పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయించటం, భవిష్యత్‌లోను ఇదే మద్దతు కొనసాగిస్తామని హామీ పొందటం చంద్రబాబు విజన్‌కు నిదర్శనమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు స్పష్టంగా ప్రజలు ఏమి కోరుకుంటున్నారో చెప్పి ప్రధాని మోదీని ఆ దిశగా హామీ ఇప్పించగలిగారని తెలిపారు.

7 నుంచి వేదాద్రిలో బ్రహ్మోత్సవాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట, మే 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7 నుంచి వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య శనివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో కె.కిశోర్ మాట్లాడారు. 7న స్వామిని పెండ్లి కుమారుడిని చేయడం, 8న అంకురార్పణ, ధ్వజారోహణ, 9న శేష వాహన సేవ, 10న హనుమంతుసేవ, 11న భూనీలా సమేత యోగా నంద లక్ష్మీ నరసింహస్వామి తిరుక్కల్యాణ మహోత్సవం జరుగుతుందని, 12న తెప్పోత్సవం, గజవాహనసేవ, 13న చూర్ణోత్సవం, వసంతోత్సవం, 14న పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తుందని తెలిపారు. ఈవోతోపాటు వంశపారంపర్య ధర్మకర్తల తరఫున కేసీపీ సిమెంట్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉదయభాను, నెట్టెంకు ఆహ్వానపత్రికలు

వేదాద్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుకు ఈవో కె.సురేష్, కేసీపీ అసిస్టెంట్ మేనేజర్ రాంప్రసాద్ ఆహ్వానపత్రికలు అందించారు.

బ్రహ్మోత్సవాల విజయవంతానికి

సమన్వయంతో పని చేయండి

● అధికారులకు నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచన

జగ్గయ్యపేట రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): వేదాద్రి గ్రామంలో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించే యోగానంద లక్ష్మీ నరసింహస్వామి తిరుక్కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 11న స్వామి కల్యాణం జరుగుతుందని, తిలకించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కృష్ణానదిలో స్నానాలకు, బందోబస్తు, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణకు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, ఫైర్, తదితర శాఖల అధికారులు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఆలయ ఈవో సురేష్‌బాబు, తహసీల్దార్ మనోహర్, ఆర్టీసీ, ఫైర్, పోలీస్, విద్యుత్, పంచాయతీ, ఫిషరీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, మే 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 24వ తేదీలోపు తమ దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. 8వతరగతి, పదో తరగతి ఉత్తీర్ణులయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94906 39639కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజాభేరి

గవర్నర్‌పేట, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజాభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ తెలిపారు. శనివారం శ్రీశ్రీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రజల నుంచి రెండు లక్షల సంతకాలను సేకరించామని తెలిపారు. ఈనెల 7వ తేదీన విద్యుత్ సౌధ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాలు మోపిందని, కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేయకుండా అదనంగా భారాలు వేస్తోందని ఆరోపించారు. విద్యుత్ అక్రమ ఒప్పందాలు రద్దు చేసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.



నిర్వహణ కొరవడడంతో కళ తప్పిన ఇబ్రహీంపట్నం రింగ్

కళావిహీనంగా..

● వెలిసిపోయిన కొండపల్లి బొమ్మలు
● చనిపోయిన పూల మొక్కలు

ఇబ్రహీంపట్నం రింగ్

ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలో ఉన్న ఇబ్రహీంపట్నం రింగ్ తెలియని వారుండరు. 2014-19 వరకు ఈ రింగ్ పచ్చని చెట్లతో నిత్యం కళకళలాడుతూ అందరికీ ఆహ్లాదాన్ని పంచేది. 2019-24 మధ్య కాలంలో రింగ్ నిరాదరణకు గురైంది. రింగ్‌లో ఉన్న పచ్చని గడ్డి మాడిపోయింది. జిల్లేడు చెట్లు మొలిచాయి. మొక్కలకు నీళ్లు పోసే నాథుడు లేక, కొండపల్లి బొమ్మలకు రంగులేసిన వారు లేక కళాహీనంగా మారింది. రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖ ద్వారంగా ఇబ్రహీంపట్నం రింగ్ కూడా ఉండే అవకాశం ఉంది. ఒకప్పుడు పవిత్రసంగమం వద్ద హైకానిక్ బ్రిడ్జ్ నిర్మాణం చేపడతారని రింగ్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తారని అనుకున్నారు. అయితే అటు తర్వాత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అంతా తారుమారై రింగ్‌కు ఈ దుస్థితి వచ్చింది. ప్రస్తుతం పలు పార్టీల రాజకీయ నాయకులకు స్వాగతం పలికేందుకు, రాజకీయ, సినీ నటుల జన్మదినాలకు ఫ్లెక్సీలు కట్టుకునేందుకే ఈరింగ్ ఉపయోగపడుతోంది. రింగ్ బాగోగులు ఎవ్వరికీ పట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా మరలా రింగ్‌కు పూర్వ వైభవం తెచ్చి సుందరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.



రంగు వెలిసి వెలవెలబోతున్న కొండపల్లి బొమ్మ

బుల్లెట్‌ను ఢీకొన్న లారీ.. యువకుడి దుర్మరణం

● మరొక యువకుడికి తీవ్రగాయాలు



దేవరకొండ సాయి (ఫైల్)

జగ్గయ్యపేట, మే 3(ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట- చిల్లకల్లు రోడ్డులో బుల్లెట్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు దుర్మరణం చెందగా, మరొక యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. జగ్గయ్యపేట ఎస్సై-2 వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గయ్యపేట చెరువు బజార్‌కు చెందిన దేవరకొండ సాయి (22) నందిగామలో ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తన స్నేహితుడు తమ్మిశెట్టి వాసు(21) తో కలిసి బుల్లెట్‌పై జగ్గయ్యపేటకు బయలుదేరాడు. చిల్లకల్లు దాటాక శుభమస్తు ఫంక్షన్‌హాలు, బేతెస్థ గార్డెన్స్ సమీపంలో లారీ యూటర్న్ తిరుగుతూ బుల్లెట్‌ను ఢీకొట్టింది. బుల్లెట్‌పై ఉన్న సాయి తలకు, దేహానికి తీవ్రగాయాలు కావటం, రోడ్డు దెబ్బ తగలడంతో అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి మృతి చెందాడు. వాసు కాలికి తీవ్ర గాయమైంది. ఆ సమయంలో జగ్గయ్యపేట రౌండ్స్‌కు వస్తున్న పెనుగంచిప్రోలు ఎస్సై అర్జున్ జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలో సాయి భౌతికకాయానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతుడు సాయి తండ్రి నాగేశ్వరరావు ప్రముఖ ఆర్‌ఎంపీ వైద్యుడు. తలలో నాలుకలో ఉండే నాగేశ్వరరావు కుమారుడు చనిపోవటంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాయి భౌతికకాయానికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, యువనేత శ్రీరాం చినబాబు నివాళులర్పించారు. నాగేశ్వరరావును పరామర్శించి వారు ధైర్యం చెప్పారు.

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

● నేడు విజయవాడలో 28 కేంద్రాల్లో పరీక్ష
● మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహణ
● కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో అధికారులకు ప్రత్యేక శిక్షణ

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): నీట్-2025 పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 13,625 మంది పరీక్ష రాయబోతున్నారు. నీట్ పరీక్ష కోసం ప్రభుత్వం నగరంలో 28 కేంద్రాలు ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. అనుమతులున్న పీడబ్ల్యూడీ అభ్యర్థులకు మాత్రం సాయంత్రం ఆరు గంటల వరకు అవకాశమిచ్చారు. పరీక్ష నిర్వహించబోయే అధికారులకు శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఏర్పాట్లు, కంట్రోల్ రూమ్ విధులు, బయోమెట్రిక్ హాజరు, వీడియోగ్రఫీ, సీల్డ్ కవర్స్ నివేదికలు, కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా పరీక్ష నిర్వహించాలని శిక్షణకు హాజరైన అధికారులకు కలెక్టర్ సూచించారు. శిక్షణ అధికారులు ఆదిశేషశర్మ, వెంకటేశ్వరరావు, ఆర్డీవో కె.చైతన్య పాల్గొన్నారు.



బిషప్ అజరయ్య బాలికల జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సజావుగా గ్రూప్-1 పరీక్ష

● తొలిరోజు 1,801 మంది అభ్యర్థులకు 1,161 మంది హాజరు.. ఈ నెల 9 వరకు పరీక్షలు

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రూప్- 1 పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. అన్ని కేంద్రాల్లో పరీక్ష సజావుగా జరిగింది. ఈ నెల తొమ్మిదో తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఎండతీవ్రత, పరీక్షా కేంద్రానికి నిమిషం ఆలస్యమయినా అనుమతించరనే నిబంధనలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. నగరంలో గ్రూప్ -1 పరీక్షకు ఆరు కేంద్రాలను కేటాయించారు. జిల్లాలో మొత్తం 1,801 మంది దరఖాస్తు చేసుకోగా 1,161 మంది(64.46 శాతం) హాజరయ్యారు. ట్యాబ్‌లతో పాటు డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్ష నిర్వహించారు. బిషప్ అజరయ్య బాలికల జూనియర్ కాలేజీ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. లైజనింగ్ అధికారులు, అసిస్టెంట్ లైజనింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

హిందూ ధర్మాన్ని విశ్వవ్యాపితం చేయడమే వీహెచ్‌పీ లక్ష్యం

● వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్

హనుమాన్‌జంక్షన్, మే 3 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని విశ్వవ్యాపితం చేయడంతో పాటు హిందూ దేవాలయాలను పరిరక్షించడమే విశ్వహిందు పరిషత్ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అన్నారు. శనివారం విశ్వహిందు పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ హనుమాన్‌జంక్షన్‌లోని తన ఫామ్‌హౌస్‌లో ఆశాజ్యోతి ఆశ్రమ పాఠశాల దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఉపకరణాలు, దుస్తులను పంపిణీ చేశారు. అలోక్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలోక్‌కుమార్ మాట్లాడారు. హిందు మతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. వంద దేశాల్లో మత ధర్మాన్ని వ్యాప్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే కుల మతాలకు అతీతంగా విశ్వ హిందు పరిషత్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోందన్నారు. హిందూ మత ధర్మాన్ని మరింత విస్తృతం చేయడానికి అయోధ్యలో రామమందిర్ నిర్మాణం దోహదపడుతుందన్నారు. రామమందిరం నిర్మాణం విశ్వహిందు పరిషత్ సాధించిన గొప్ప విజయమన్నారు. భారతదేశం ఒక హిందు దేశం, ఒక కులానికి మతానికి చెందినది కాదన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడులు పూర్తిగా మత పరమైనవన్నారు. విశ్వహిందు పరిషత్ తెలంగాణా, ఆంధ్రరాష్ట్రాల అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ విశ్వహిందు పరిషత్ ఒక ధార్మిక సామాజిక సంస్థ, ధర్మం కోసం హైందవ శంఖారావం నిర్వహించిందన్నారు. సమాజం కోసం లక్ష ఏకోపాధ్యాయ పాఠశాలలు, అనాధ శరణాలయాలు, హాస్టల్స్, గోశాలలు నిర్వహిస్తోందన్నారు. దేవాలయాలను అభివృద్ధి చేయడంతో పాటు అర్చకులకు ప్రత్యేక శిక్షణాలయాలను నిర్వహిస్తుందన్నారు. సమాజాన్ని సమరసత మార్గంలో నడిపించడానికి పరిషత్ కృతనిశ్చయంతో పని చేస్తోందన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్, నాయకులు శ్రీనివాసరాజు ఉన్నారు.

బెజవాడలో హోటల్‌పై మెరుపు దాడులు

వ్యభిచారం చేస్తుండగా పట్టుకున్న పోలీసులు

నలుగురు యువతులు, ఇద్దరు యువకులు అరెస్టు

గుణదల, మే 3 (ఆంధ్రజ్యోతి) : బందరురోడ్డులోని పీవీపీ మాల్ సమీపంలో ఉన్న ఓ హోటల్‌పై మాచవరం పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందస్తు సమాచారం మేరకు మాచవరం సీఐ ప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం హోటల్‌కు చేరుకుని పరిశీలించగా, రూమ్‌లో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన నలుగురు యువతులు ఉండటాన్ని గుర్తించారు. వారితో ఉన్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరు వ్యభిచారం చేస్తున్నట్లుగా ఆధారాలు లభ్యం కావడంతో అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన పల్లెపోగు కుమార్ రాజా పీవీపీ మాల్ రోడ్డులో ఓ హోటల్లో రెండు రూమ్‌లు అద్దెకు తీసుకుని ఈ వ్యభిచారం చేయిస్తున్నట్టుగా గుర్తించారు. కుమార్ రాజా ఫోన్ల ద్వారా విటులను సంప్రదించి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన యువతులతో హోటల్లోనే వ్యవహారాలు నడుపుతున్నట్టు గుర్తించామని సీఐ తెలిపారు. ఇప్పటి వరకు స్పా సెంటర్లపైనే దృష్టి పెట్టామని, ఇక హోటళ్లపై కూడా దృష్టిపెడతామని, ఈ తరహా కార్యకలాపాలు జరిగితే సహించేది లేదన్నారు. హోటళ్లలో ఎవరైనా ఇలా పట్టుబడితే సదరు వ్యక్తులపైనే కాకుండా హోటల్ నిర్వాహకులపై కూడా కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

అమరావతిలో తప్పిపోయిన రామగిరివాసి

రామగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బార్లపల్లి గ్రామానికి చెందిన దేవజ్జి గజ్జిలప్ప అమరావతిలో తప్పిపోయాడు. రాజధాని పనుల పునఃప్రారంభ వేడుకలకు స్థానికులతో కలిసి పేరూరు నుంచి బస్సులో వెళ్లిన ఆయన.. అక్కడ జనంలో కనబడకుండాపోయారు. గాలించినా కనిపించకపోవడంతో మిగిలిన వారు బస్సులో తిరిగి వచ్చేశారు. ఇప్పటి వరకూ ఆచూకీ తెలియలేదని గ్రామస్థులు తెలిపారు. అతని గురించి సమాచారం తెలిస్తే టీడీపీ రామగిరి మండల కన్వీనర్ సుధాకర్ సెల్ నంబర్ 8374594679, దేవజ్జి వెంకటేశ్ సెల్ నంబర్‌కు 9440260494 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని గ్రామస్థులు కోరారు.

ఇంటి దొంగలు..!

(5వ పేజీ తరువాయి)

రాకుండా, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా తెరవెనుక పెద్దలు వ్యవహారం నడుపుతూ వచ్చారు. అవినీతి ఆరోపణలు, విచారణ జరిగాక అదే మండలంలో పనిచేస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే కారణంతో ఏఈలు వ్యూహాత్మకంగా గృహనిర్మాణ సంస్థ జిల్లా కార్యాలయంలో పనిచేసేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అధికారుల విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైనా సుదీర్ఘకాలంగా జీతాలు పొందుతూ వస్తున్నారు.

అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ అక్రమాలు

అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో గృహనిర్మాణ శాఖలో పనిచేసే ఉద్యోగులంతా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసినవారే. పామర్రు నియోజకవర్గం మొవ్వ మండలంలో పనిచేసే అరుణకుమారి అనే వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను వైసీపీ ప్రభుత్వ హయాంలో చల్లపల్లి మండల గృహనిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ఏఈగా నియమించారు. గతంలో చల్లపల్లి మండలం ఇన్‌చార్జులుగా అరుణకుమారి, వినయ్‌చంద్ర పనిచేసిన కాలంలో పేదల ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్, ఇనుము ఇవ్వకుండానే ఇచ్చినట్టుగా రికార్డుల్లో నమోదు చేశారు. వందలాది బస్తాల సిమెంట్, ఏడు టన్నులకుపైగా ఇనుమును మాయం చేశారనే అంశంపై ఫిర్యాదులు అందాయి. ఆ ఇద్దరు ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణచేసి నివేదిక సిద్ధం చేశారు. ఈ విచారణ అనంతరం అరుణకుమారిపై చర్యలు తీసుకోకుండా మచిలీపట్నంలోని జిల్లా గృహనిర్మాణ శాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. వినయ్‌చంద్‌ను కోడూరు మండలానికి బదిలీ చేశారు. మచిలీపట్నంలోని జిల్లా గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో పనిచేసే ఒక డీఈ వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇంతకాలంగా తెరవెనుక చక్రం తిప్పారనే విమర్శలు ఉన్నాయి. కానీ, అరుణకుమారి, వినయ్‌చంద్రను శాశ్వతంగా విధుల నుంచి తొలగించడంతో పాటు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. గతంలో చల్లపల్లి, ఘంటసాల మండలాల సిమెంట్ గోడౌన్ ఇన్‌చార్జిగా పనిచేసిన ఏఈ వై.శేషగిరిరావును మాత్రం సస్పెండ్ చేశారు.

డీఈ కనుసన్నల్లోనే అక్రమాలు

అవనిగడ్డ గృహనిర్మాణ సంస్థ డివిజనల్ ఇన్‌చార్జి (డీఈ)గా పనిచేసిన బానోజీరావు తనదైనశైలిలో వ్యవహరించి అక్రమాలకు తెరతీశాడనే ఆరోపణలున్నాయి. చల్లపల్లి, ఘంటసాల మండలాల ఇన్‌చార్జుల లాగిన్‌లో నుంచి సిమెంట్, ఇనుమును పక్కదారి పట్టించారని డీఈపై పలు ఫిర్యాదులు అందాయి. దీనిపైనా అధికారులు విచారణ చేశారు. సిమెంట్, ఇనుము మాయం చేశారని రుజువైంది. దీంతో డీఈపైనా చర్యలు తీసుకోవాలని విచారణ అధికారులు సిఫారసు చేశారు. దీంతో ఆయనపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఘంటసాల మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు సిమెంట్, ఇనుము ఇచ్చేందుకు గోడౌన్ ఉంది. చల్లపల్లి ఏఈగా పనిచేసిన వై.శేషగిరిరావు గతంలో ఈ గోడౌన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన్ను ముదినేపల్లి ఏఈగా బదిలీ చేశారు. బదిలీ అయిన శేషగిరిరావు ఘంటసాల గోడౌన్‌కు సంబంధించిన రికార్డులను అప్పగించలేదు. ఆ తరువాత ఘంటసాల ఏఈగా సురేంద్రను నియమించారు. డీఈ బానోజీరావు, ఏఈ సురేంద్ర తమ చిత్తానుసారంగా వేలాది బస్తాల సిమెంటును మాయం చేశారనే ఆరోపణలపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. సిమెంట్ మాయంలో డీఈ పాత్ర అధికంగా ఉన్నట్టుగా విచారణలో వెల్లడైంది. ఘంటసాల ఏఈ సురేంద్ర ఒక వ్యాన్ కొనుగోలు చేసి, ఆ వ్యాన్ డ్రైవర్ ద్వారా లబ్ధిదారులు ఇనుము, సిమెంట్ పంపిణీ పేరుతో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. నియోజవర్గంలో రెండువేల టన్నులకుపైగా ఇసుకను లబ్ధిదారులకు ఇవ్వకుండా ఇచ్చినట్టుగా చూపిన అంశంపైనా అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి.

పెదపారుపూడి మండలంలో పక్కా అవినీతి

పామర్రు నియోజకవర్గంలోని పెదపారుపూడి మండలంలో సిమెంట్, ఇనుము పెద్దమొత్తంలో మాయమైంది. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు విచారణ చేస్తున్నారు. ఇటీవల పెదపారుపూడి మండలం గృహనిర్మాణ సంస్థలో పనిచేసే సిబ్బందిని జిల్లా గృహనిర్మాణ సంస్థ కార్యాలయానికి పిలిపించారు. రికార్డులను తనిఖీ చేశారు. గతంలో పనిచేసిన డీఈ సిమెంట్, ఇనుము లబ్ధిదారులకు ఇవ్వకుండానే పామర్రులోనే గుంపగుత్తగా విక్రయించేశారని సిబ్బంది చెప్పినట్లు సమాచారం. గతంలో పామర్రులో పనిచేసిన డీఈ ప్రస్తుతం జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్నారు. పెడన నియోజకవర్గంలో ఒక మండలంలో నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగం చేస్తున్న ఒక ఏఈపైనా విచారణ చేయాలని ఇప్పటికే ఫిర్యాదులు అందాయి. అధికారులు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

కొత్త వాహనాల బ్యాటరీలు మాయం

(5వ పేజీ తరువాయి)

మొత్తం 5 టిప్పర్లను రెండు వారాల కిందట డెలివరీ ఇచ్చింది. వీటిని సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లో ఉంచారు. సాంకేతిక కారణాల వల్ల కార్పొరేషన్ వాటిని ఇంకా స్వాధీనంలోకి తీసుకోలేదు. ఈలోపే ఆ వాహనాల్లోని బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. తొలుత ఒక బ్యాటరీ వైర్లు కత్తిరించి దొంగతనం చేశారు. విషయం అధికారులకు తెలిసి.. ఎవరు దొంగతనం చేసి ఉంటారన్న దానిపై విచారణ జరుగుతుండగానే, రెండో లారీ బ్యాటరీ కూడా పోయింది. ఆ వెంటనే మరో రెండు లారీల బ్యాటరీలు కూడా మాయమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుంది. దీంతో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఎక్సెల్ ప్లాంట్‌లో బిగించిన 35 సీసీ కెమెరాలను పరిశీలించగా, దొంగలెవరన్నది తేలింది. పార్క్ సెక్షన్‌కు చెందిన ఉద్యోగులుగా గుర్తించారు. వారి నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఈ విషయాన్ని స్థానిక ఈఈ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఘటన జరిగి వారం అవుతున్నా ఇప్పటి వరకు ఉన్నతాధికారులకు కనీసం నోట్ ఫైల్ కూడా పంపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

విచారణ ఎప్పటికో..!

(5వ పేజీ తరువాయి)

వైస్ చైర్మన్ సంయుక్తంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఇద్దరి స్పెసిమన్ సిగ్నేచర్లను ధ్రువీకరించి బ్యాంక్‌కు లేఖ రాయాలి. కానీ, సదరు ఏఈ మాత్రం తూర్పు డెల్టా కమిటీ ప్రాజెక్టు చైర్మన్ ఒక్కరి సంతకాన్నే స్పెసిమన్ సిగ్నేచర్‌గా గుర్తిస్తూ ఎస్‌ఈకి తెలియకుండా బ్యాంక్ అధికారులకు లేఖ రాశారు. బ్యాంక్ అధికారులు దీన్ని పునఃపరిశీలించడంతో జలవనరుల శాఖ అధికారులకు అసలు విషయం తెలిసింది. దీంతో సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉన్నతాధికారులకు తెలియకుండా, కాంపెటెటివ్ అథారిటీ కాకపోయినా స్పెసిమన్ సిగ్నేచర్లను ఎలా ధ్రువీకరించి బ్యాంక్‌కు పంపారో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు


అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148,157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

అమరావతి పనులు ప్రారంభం కావడం సంతోషం
గద్దె అనురాధ



పటమట: రాజధాని అమరావతి పనులు ప్రధాని మోదీ చేతుల మీదుగా సీఎం చంద్రబాబు సారథ్యంలో పునఃప్రారంభం కావడం సంతోషంగా ఉందని జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. అశేష జనవాహిని మధ్య, భూములు త్యాగం చేసిన రైతుల ఆనందోత్సాహాల మధ్య ఇలాంటి కార్యక్రమం జరగడం, అందులో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

సెంట్రల్ తహసీల్దార్.. ఎవరి మాటా వినరు

- కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితులు
- కార్పొరేటర్లు ఫోన్ చేసినా స్పందించని తహసీల్దార్, వీఆర్వోలు
- అంతేకాక కార్పొరేటర్‌పైనే కేసు పెడతానన్న వీఆర్వో
- తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా అదే పరిస్థితి

(ఆంధ్రజ్యోతి, కృష్ణలంక)

'సీతయ్య...ఎవరి మాటా వినడు' అన్న చందంగా వుంది సెంట్రల్ తహసీల్దార్ వెంకట్రామయ్య పరిస్థితి. ప్రజల సమస్యలను నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు చెబుతున్నా పనులు జరగడం లేదు. తూర్పు ఎమ్మెల్యే గద్దె ఆఫీసు నుంచి కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ ఫోన్ చేసి గట్టిగా అడిగితే ఆయనపై వీఆర్వో కేసు పెడతానని బెదిరించడం గమనార్హం. తర్వాత ఆయన ఇదే విషయంపై తహసీల్దార్‌తో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది.

వివరాలలోకి వెళ్తే...తూర్పు నియోజకవర్గంలోని 21వ డివిజన్‌లకు గాను 17, 18, 19లో సగం, 20, 21, 22 డివిజన్లు సెంట్రల్ తహసీల్దార్ పరిధిలోకి (గాంధీనగర్) వస్తాయి. నియోజకవర్గంలోని మిగతా డివిజన్లన్నీ తూర్పు తహసీల్దార్ (పటమట) పరిధిలోకి వెళ్తాయి. అయితే సెంట్రల్ పరిధిలోని కృష్ణలంక ప్రాంత డివిజన్ల ప్రజలు కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం ఉండటం లేదు. అలాగే 'అమ్మ్యామ్యాలు' సమర్పించందే ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ) ఇవ్వడం లేదనేది బహిరంగ రహస్యం. కుల ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయం ద్వారా దాఖలు చేయగానే వీఆర్వో పంచనామా జరిగిన తర్వాత తహసీల్దార్‌కు నోట్ పెడతారు. అక్కడ నుంచి మెలికలు ప్రారంభమవుతాయి. కుల ధ్రువీకరణ పత్రంకోసం చదువులేని వారు వారి కుల సంఘ ప్రెసిడెంట్ ద్వారా లేఖను అప్లికేషన్‌కు జతచేస్తుంటారు. గతంలో పనిచేసిన తహసీల్దార్‌లు అందరూ కుల ధ్రువీకరణ పత్రాన్ని వీఆర్వో పంచనామా తదితర అంశాలను పరిశీలించి సర్టిఫికెట్లు జారీ చేసేవారు. కానీ సెంట్రల్ తహసీల్దార్‌గా వెంకట్రామయ్య వచ్చిననాటి నుంచి చదువులేని వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటే 'మీ ఇంటి పేరుతో గతంలో కుల ధ్రువీకరణ పత్రాలు ఉన్నవారి సర్టిఫికెట్ సమర్పిస్తేనే ...నీకు సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుందని' చెప్పడంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ప్రాంతాల నుంచి వచ్చి విజయవాడలో స్థిరపడిన పేదవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు చేసేదిలేక స్థానిక కార్పొరేటర్ వద్దకు కానీ, లేదా కార్పొరేటర్ సహకారంతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌వద్దకు వెళ్లి మొరపెట్టుకొంటున్నారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ కృష్ణలంకలోని 107 సచివాలయం వీఆర్వోకు ఫోన్ చేసి కుల ధ్రువీకరణ పత్రం కోసం ప్రజలను మీ ఆఫీసుల చుట్టూ ఎన్ని రోజుల పాటు తిప్పించుకొంటారని, తాను ఎమ్మెల్యే గద్దె ఆఫీసు నుంచి మాట్లాడుతున్నానని చెప్పారు. దీంతో వీఆర్ఓ 'గద్దె రామ్మోహన్ ఆఫీసు నుంచి అయితే నాకేంటి, మా తహసీల్దార్ గారు ఎలా పడితే అలా సర్టిఫికెట్లు ఇవ్వద్దంటున్నారని' చెప్పారు. మరలా ముమ్మనేని వీఆర్వోతో 'మీ పంచనామా పూర్తయిన తర్వాత కూడా ప్రజలను మీ ఆఫీసుల చుట్టూ ఇలా తిప్పించుకోవడం బాగాలేదమ్మా' అని అనడంతో 'ఎక్కువగా మాట్లాడితే మీపై కేసు పెడతానని' వీఆర్వో అన్నారు. దీంతో ముమ్మనేని 'ప్రజల సమస్యలు పరిష్కరించడంలో భాగంగా తాము జైలుకెళ్లేందుకు కూడా సిద్ధమని' ఆమె నుంచి తహసీల్దార్ నెంబరు తీసుకొని ఆయనతో మాట్లాడారు. ఆయన కూడా సరిగ్గా స్పందించకపోవడంతో ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తహసీల్దార్ తీరుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
టీడీపీ, జనసేన నాయకుల ఆరోపణ

ఈ సంఘటనపై టీడీపీ 18, 20, 22 డివిజన్ల అధ్యక్షులు వేముల దుర్గారావు, మోటేపల్లి చిన్నా, పలిశెట్టి అన్నారావు, జనసేన 20వ డివిజన్ అధ్యక్షుడు జి.జయకుమార్‌లు మాట్లాడుతూ, ప్రజలు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం సెంట్రల్ తహసీల్దార్ కార్యాలయానికి కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం ఉండటం లేదన్నారు. ఒక సర్టిఫికెట్ కోసం నెలరోజులకు పైగా తిరగాల్సి వస్తోందని వాపోయారు. సచివాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి నెల రోజులకు పైగా కుల ధ్రువీకరణ పత్రం కోసం తిరగాల్సి వస్తోందని డివిజన్లలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం అయితే ఓ వీఆర్ఓ బాధితుడిని ఖర్చులుంటాయని డబ్బులు డిమాండ్ చేయడం జరిగిందని, అప్పుడు తాము జోక్యం చేసుకొని టీడీపీ డివిజన్ అధ్యక్షుడిని మాట్లాడుతున్నామని చెబితే వెంటనే ఎఫ్ఎంసీ జారీ చేశారన్నారు. ప్రభుత్వం మారినా తాము వైసీపీ ప్రభుత్వ హయాంలోనే పనిచేస్తున్నట్లు అధికారులు భావిస్తు న్నారని వారు మండిపడ్డారు. అధికారుల తీరు మార్చుకోకపోతే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



కొచ్చిన్ మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ షిబులతో విజయవాడ కార్పొరేటర్ల బృందం

కొచ్చిన్‌లో కార్పొరేటర్ల బృందం

కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కొచ్చిన్ కార్పొరేషన్‌లోని పరిపాలన విధానం, ప్రజా ప్రతినిధుల ఎంపిక అంశాలతో పాటుగా, నగరంలో కాలుష్యం తగ్గించేందుకు చేపడుతున్న చర్యలను కొచ్చిన్ కార్పొరేషన్ మేయర్ అనిల్ కుమార్ విజయవాడ కార్పొరేటర్ల బృందానికి తెలియజేశారు. దక్షిణాది రాష్ట్రాల స్టడీ టూర్‌లో భాగంగా కొచిన్ కార్పొరేషన్‌ను విజయవాడ కార్పొరేటర్ల బృందం శనివారం సందర్శించగా, కొచ్చిన్ కార్పొరేషన్ మేయర్ అనిల్ కుమార్, కమిషనర్ షిబు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంలో మేయర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నివారణ ప్రణాళికలు, మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వివిధ ప్రాజెక్టుల అమలు, పార్కుల నిర్వహణ అంశాలను బృందానికి వివరించారు. కొచ్చిన్ కార్పొరేషన్ కమిషనర్ షిబు కొచిన్‌లోని 11.5 ఎకరాలలో ఉన్న సుభాష్ బోస్ పార్క్ విశిష్టతను బృందానికి వివరించారు. అనంతరం సుభాష్ బోస్ పార్క్‌ను విజయవాడ కార్పొరేటర్ల బృందం ఫీల్డ్ విజిట్ చేశారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

నగర కమిషనర్ ధ్యానచంద్ర



కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు వేసవిలో ఎటువంటి మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర కమిషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్-2025లో భాగంగా శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆయన ఛాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా అధికారులను ఎక్కడెక్కడ బోర్లు ఏర్పాటు చేయాలి, మంచినీటి సమస్య ఉన్న ప్రాంతాలను అడిగి తెలుసుకున్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రూ.11కోట్ల 85 లక్షలు కేటాయించడం జరిగిందని, నగరంలో అన్ని హ్యాండ్ బోర్లు రిపేర్ చేసి పూర్తిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంచినీటి సమస్యలు ఉన్న చోట్ల హ్యాండ్ బోర్లు, పవర్ బోర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంలో ఇంజనీరింగ్ అధికారులు పలుచోట్ల నీటి మోటార్లు రిపేర్లు ఉన్నాయని తెలియజేయగా కమిషనర్ స్పందించి నీటి మోటార్లు పూర్తిగా పాడైపోయి ఉంటే వాటి స్థానంలో కొత్త మోటర్లు కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలన్నారు. వాటర్ పైప్‌లైన్లు లీకులున్నట్లయితే లీకులున్న పైపులను మార్చి నూతన పైప్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులు చేసే సమయంలో ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా ట్యాంకర్ ద్వారా ఎప్పటికప్పుడు మంచినీటి సరఫరా అయ్యేలా చూసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేస్తూ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

రాజధాని అమరావతిని నిర్మించడం
అదృష్టంగా భావిస్తున్నాం : ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతి నిర్మాణానికి తాము అండగా ఉంటామని ప్రధాని మోదీ ప్రకటించడం సంతోషకరమైన విషయమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. అద్భుతమైన అమరావతిని సృష్టించిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచి వుంటుందన్నారు. శనివారం తూర్పు పరిధి 20వ డివిజన్ ఎం హోటల్ ప్రాంతంలో గద్దె రామ్మోహన్ పర్యటించారు. స్థానికంగా వున్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం నిరుపేద కుటుంబాల వారికి ప్లాట్‌ఫాం రిక్షా, తోపుడు బండి, టిఫిన్ బండిని అందచేశారు.



రిక్షా బళ్లను అందిస్తున్న గద్దె రామ్మోహన్

ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ఆంధ్రుల రాజధాని అమరావతి కూటమి ప్రభుత్వం నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మోటేపల్లి చిన్నా, కొడాలి సాయిబాబు, అడపా శివ, వేముల దుర్గారావు, గౌరిపర్తి నామేశ్వరరావు, పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పు వల్లే యువతలో గుండెపోటు

ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె. వంశీకృష్ణ

బెంజిసర్కిల్, మే 3 (ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో వచ్చిన మార్పువల్లే యువతలో గుండెపోటుకు ప్రధాన కారణమవుతోందని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె. వంశీకృష్ణ అన్నారు. బెంజిసర్కిల్ నాస్తిక్ కేంద్రంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం డాక్టర్ జి. సమరం అధ్యక్షతన యువతలో గుండెపోటు అనే అంశంపై జరిగిన ఆరోగ్య సదస్సులో డాక్టర్ వంశీకృష్ణ ప్రసంగించారు. యువతలో స్థూలకాయం, మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్ గుండెపోటుకు దారితీస్తున్నా యన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాలు వడివడిగా నడవడం, యోగా చేయడం, తక్కువ నూనె, తక్కువ ఉప్పు, తక్కువ తీపి పదార్థాలు తీసుకోవడం, ధూమపానం, మద్యపానం పూర్తిగా మానేస్తే గుండెపోటును అరికట్టవచ్చని చెప్పారు. ఈ సంద ర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ, వేదికపై డాక్టర్ జి. సమరం

మోదీ పర్యటనతో ఏపీకి మేలు

బీజేపీ నేత పోతంశెట్టి నాగేశ్వరరావు

పటమట, మే 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి సభలో ఏపీకి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రధాని మోదీ హామీతో ఆంధ్రప్రదేశ్ రూపు రేఖలు మారనున్నాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోతంశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. పటమట ఆయన కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ అప్పులతో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మారబోతుందన్నారు. అమరావతి సభ సాక్షిగా మోదీ రూ.60 వేల కోట్ల అభివృద్ధి పనుల్ని ప్రారంభించారన్నారు. అమరావతి సభ అనంతరం ప్రధాని మోదీకి వీడ్కోలు పలికే కార్యక్రమంలో తనను భాగస్వామి చేసినందుకు బీజేపీ రాష్ట్ర, జిల్లా కమిటీలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ప్రారంభం రేపు

విజయవాడ స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నాయి. జూన్ 4వరకు కొనసాగనున్నాయి. జిల్లాలో 50 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

వాటర్ స్పోర్ట్స్.. పున్నమిఘాట్, **వెయిట్ లిఫ్టింగ్..** ఐజీఎంసీ, తిరువూరు, **రెజ్లింగ్..** జడ్పీహెచ్ స్కూల్ నున్న,ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్ కొత్తపేట, **యోగా..**కేవీకే కృష్ణలంక, **హ్యాండ్‌బాల్..** జడ్పీహెచ్ స్కూల్ నున్న, **హాకీ..** జడ్పీహెచ్ స్కూల్ నున్న, ఎంబీపీ స్టేడియం, **జూడో..** ఐజీఎంసీ, వైఎస్సార్ కాలనీ (జక్కంపూడి), శుభోదయ హైస్కూల్, కేఆర్‌వీఆర్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ క్లబ్, **కబడ్డీ..** ఐజీఎంసీ, సత్యనారాయణపురం రైల్వే కాలనీ, రైల్వే స్టేడియం, జడ్పీ హైస్కూల్ అంబాపురం, జడ్పీహెచ్ తిరువూరు, **నెట్‌బాల్..** ఐజీఎంసీ, జడ్పీహెచ్ స్కూల్ పటమట, **పవర్ లిఫ్టింగ్..** కేవీకే జగ్గయ్యపేట, **సాఫ్ట్‌బాల్..** ప్రభుత్వ జూనియర్ కళాశాల రాధానగర్(పాయకాపురం), ఐజీఎంసీ, **టేబుల్ టెన్నిస్..** డీఆర్ఆర్ఎంసీ, **తైక్వాండో..** ఐజీఎంసీ, **టెన్నిస్..** ఐజీఎంసీ, **వాలీబాల్..** ఐజీఎంసీ, జడ్పీహెచ్ స్కూల్ (అల్లూరు, జి. కొండూరు, కొండపల్లి, వీరులపాడు), **అథ్లెటిక్స్..** ఐజీఎంసీ, రైల్వే స్టేడియం, ఎంబీపీ స్టేడియం, ఆంధ్రా లయోలా కళాశాల, **బాస్కెట్ బాల్..** ఐజీఎంసీ, కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ పటమట, **ఆర్చరీ...** ఓల్గా ఆర్చరీ అకాడమీ, **బ్యాడ్మింటన్..** సీహెచ్ఆర్‌కే, డీఆర్ఆర్ ఎంసీ ఇండోర్ స్టేడియం, **బాక్సింగ్..** ఐజీఎంసీ, కేవీకే కృష్ణలంక, స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ క్లబ్ భవానీపురం, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ (కొత్తపేట), **ఫుట్‌బాల్..** ఐజీఎంసీ, ఎంబీపీ, జడ్పీహెచ్ స్కూల్ (నిడమానూరు), రైల్వే గ్రౌండ్స్ (రాయనపాడు)లో జరుగుతాయని శాప్ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి చదరంగ పోటీలు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండర్-9 బాలబాలికల చదరంగ పోటీలు కానూరులోని స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలను స్కూల్ సీఈవో జాహ్నవి ప్రారంభించారు. 97మంది బాలురు, 37మంది బాలికలు పాల్గొనగా మొత్తం 7 రౌండ్లు జరుగుతాయి. మొదటి రోజు 4రౌండ్లు జరగ్గా బాలుర విభాగంలో హితేష్, జస్వంత్, శశాంక్, ప్రభంజన్ నాయుడులు నాలుగు పాయింట్లతో ముందంజలో ఉన్నారు. బాలికల విభాగంలో మోధిత రెడ్డి 4 పాయింట్లు, మోక్ష సత్య ఆద్య, సహస్ర లు 3.5 పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఆదివారం మిగిలిన 3రౌండ్లు జరుగుతాయి.

జగన్మాత సన్నిధిలో శివలీలలపై కథాగానం

ఇంద్రకీలాద్రి, మే 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి నగరానికి చెందిన శ్రీరామ కంజిరకథ బృందం దుర్గమ్మ సన్నిధిలో శనివారం కథాగానం చేశారు.

ప్రఖ్యాత జానపద కళాకారుడు విభూతి రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శివలీలలపై కథాగానం చేశారు. మల్లేశ్వరుని మహిమలు, కిరాతార్జునీయం, అర్జునినికి పాశుపతాస్త్రం అనుగ్రహించడం వంటి ఘటనలను రాగ రంజితంగా గానం చేశారు. ప్రదర్శన అంతరం కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

ఘనంగా శ్రీ రామానుజాచార్యుల తిరునక్షత్రోత్సవం

విజయవాడ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): సమతావాది భగవత్ శ్రీ రామానుజాచార్యుల తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని చాతాద శ్రీ వైష్ణవ కృష్ణానదీ తీర పురోహిత సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ మాట్లాడుతూ కుల, మత, వర్ణ బేధాలకు అతీతంగా మానవాళి జీవనం సాగించాలని ఆనాడే రామానుజాచార్యులు ఉపదేశించారన్నారు. సమాజ, సమతా భావానికి ఆయన నిలువెత్తు దర్పణమన్నారు. పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనన్న ధ్యేయంతో రామానుజాచార్యులు జీవితాంతం పరితపించారని, ఆయన ఆశయాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం వుందని తెలిపారు. చాతాద శ్రీ వైష్ణవ సంఘం తరఫున కొండపల్లి ప్రసాద్, సెటగోపం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148,157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

జగన్మాత సన్నిధిలో శివలీలలు కంజిర కథాగానం



ఇంద్రకీలాద్రి, మే 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి నగరానికి చెందిన శ్రీరామ కంజిరకథ బృందం దుర్గమ్మ సన్నిధిలో శనివారం కథాగానం చేశారు. ప్రఖ్యాత జానపద కళాకారుడు విభూతి రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శివలీలలుపై కథాగానం చేశారు. మల్లేశ్వరుని మహిమలు, కిరాతార్జునీయం, అర్జునినికి పాశుపతాస్త్రం అనుగ్రహించడం వంటి ఘటనలను రాగ రంజితంగా గానం చేశారు. ప్రదర్శనం అంతరం కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

టెలీకాన్ఫరెన్స్‌లో సమ్మర్ యాక్షన్ ప్లాన్-2025పై అధికారులతో వీఎంసీ కమిషనర్ సమీక్ష

కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు వేసవిలో ఎటువంటి మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్-2025లో భాగంగా శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ శనివారం ఆయన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా అధికారులను ఎక్కడెక్కడ బోర్లు ఏర్పాటు చేయాలి, ఎక్కువగా మంచినీటి సమస్య ఉన్న ప్రాంతాలను అడిగి తెలుసుకున్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రూ.11కోట్ల 85 లక్షలు కేటాయించడం జరిగిందని, నగరంలో అన్ని హ్యాండ్ బోర్లు మరమ్మతులు పూర్తిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంచినీటి సమస్యలున్న చోట్ల హ్యాండ్ బోర్లు, పవర్ బోర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు పలుచోట్ల నీటి మోటార్లకు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. దీనిపై కమిషనర్ స్పందించి వెంటనే వాటిని మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఏమైనా నీటి మోటార్లు పూర్తిగా పాడైపోయి ఉంటే వాటి స్థానంలో కొత్త మోటార్లు కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే పలుచోట్ల వాటర్ పైప్‌లైన్లు లీకులున్నట్లు అధికారులు తెలియజేయగా కమిషనర్ వెంటనే లీకున్న పైపులను మార్చి నూతన పైప్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులు చేసే సమయంలో ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా ట్యాంకర్ ద్వారా ఎప్పటికప్పుడు మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేస్తూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

కన్నుల పండువగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై ఉపాలయంలో కొలువై ఉన్న వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, లీలా కల్యాణోత్సవం శనివారం నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని మేళ, తాళాల మధ్య భక్తి, శ్రద్ధలతో శాస్త్రోక్త, వేదోక్తంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని, వల్లీ దేవసేనలను వధూవరులుగా వేదికపై ఉంచి ఆగమోక్త, శాస్త్రోక్తంగా జరిపించారు. దేవేరులకు మాంగళ్యధారణ, తలంబ్రాలు కార్యక్రమాలను భక్తుల ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 59వ డివిజన్‌లో సామూహిక సీమంతాలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే ముందుగా మహిళలకు పసుపు, కుంకుమతో పాటు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో బంగారు నాయుడు, వేల్పుల రాజేష్, ఎస్‌కే జాన్‌వలి, పర్విన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సంతకాల సేకరణ

వన్‌టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా విజయవాడలో సీపీఎం శనివారం ప్రజాభేరి నిర్వహించింది. 50వ డివిజన్ మహంతిపురంలో జరిగిన కార్యక్రమంలో సీహెచ్ బాబూరావు, బోయి సత్యబాబు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పాదయాత్ర నిర్వహించి, ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లపై కూటమి నమ్మక ద్రోహం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వ బాటలోనే కూటమి ప్రభుత్వం నడుస్తూ మీటర్లు బిగిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఈ.వి.నారాయణ, సూరిబాబు, సుబ్బారెడ్డి, కొండారెడ్డి, రాజు, గురప్ప, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం : విద్యుత్ సౌధ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 7న తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు కె.దుర్గారావు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు రద్దు, సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని 60వ డివిజన్ వాంబేకాలనీలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎస్‌కే పీరు, శ్యామ్, రజని, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



కొచ్చిన్ మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ షిబులతో విజయవాడ కార్పొరేటర్ల బృందం

కొచ్చిన్‌లో కార్పొరేటర్ల బృందం

కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కొచ్చిన్ కార్పొరేషన్‌లోని పరిపాలన విధానం, ప్రజా ప్రతినిధుల ఎంపిక అంశాలతో పాటుగా, నగరంలో కాలుష్యం తగ్గించేందుకు చేపడుతున్న చర్యలను కొచ్చిన్ కార్పొరేషన్ మేయర్ అనిల్ కుమార్ విజయవాడ కార్పొరేటర్ల బృందానికి తెలియజేశారు. దక్షిణాది రాష్ట్రాల స్టడీ టూర్‌లో భాగంగా కొచిన్ కార్పొరేషన్‌ను విజయవాడ కార్పొరేటర్ల బృందం శనివారం సందర్శించగా, కొచ్చిన్ కార్పొరేషన్ మేయర్ అనిల్ కుమార్, కమిషనర్ షిబు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంలో మేయర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నివారణ ప్రణాళికలు, మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వివిధ ప్రాజెక్టుల అమలు, పార్కుల నిర్వహణ అంశాలను బృందానికి వివరించారు. కొచ్చిన్ కార్పొరేషన్ కమిషనర్ షిబు కొచిన్‌లోని 11.5 ఎకరాలలో ఉన్న సుభాష్ బోస్ పార్క్ విశిష్టతను బృందానికి వివరించారు. అనంతరం సుభాష్ బోస్ పార్క్‌ను విజయవాడ కార్పొరేటర్ల బృందం ఫీల్డ్ విజిట్ చేశారు.

వైన్ షాపులో బర్త్‌డే వేడుక

స్నేహితుల మధ్య ఘర్షణ ఇద్దరికి గాయాలు

అజిత్‌సింగ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డులోని ఓ వైన్ షాపులో జరిగిన పుట్టిన రోజు పార్టీ ఘర్షణకు దారి తీసింది. పైపులరోడ్డు సమీపంలోని లక్కీ వైన్స్ షాపులో కొంత కాలంగా అనధికారిక పర్మిట్ రూమ్ నడుస్తుంది. శుక్రవారం అయోధ్యనగర్‌కు చెందిన బొడ్డు సాయి స్నేహితులకు వైన్ షాపులో పుట్టిన రోజు పార్టీ ఏర్పాటు చేశాడు. అయోధ్యానగర్‌కు చెందిన సోమ బాల శివశంకర్‌తో పాటుగా విద్యాధరపురానికి చెందిన నక్కా గోపీరాజు మరికొందరుస్నేహితులు హాజరయ్యారు. మద్యం మత్తులో గోపీరాజు, శివశంకర్‌ల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువురు రాళ్లతో దాడి చేసుకోవ డంతో ఇద్దరికి తల పగిలాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

ఒకరికి గాయాలు

చిట్టినగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరు గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొత్తూరు తాడేపల్లికి చెందిన బుద్దవరపు రామకృష్ణ ఇంటి గ్యాస్ నిమిత్తం తన బైక్‌పై వెలగలేరు వెళుతుండగా తాడేపల్లి హైస్కూల్ వద్దకు చేరుకునే సరికి పాముల కాల్వ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రామకృష్ణ గాయపడ్డాడు. బాధితుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటి వారిపై కేసు...

తనను శారీరకంగా మానసికంగా అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారని ఓ మహిళ కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కే ఎల్‌రావు నగర్‌కు చెందిన ఎండీ ఫాతిమా బేగం 12 ఏళ్ల క్రితం వివాహం చేసుకోగా వారికి ఇద్దరు కుమారులు. ఫాతిమా బేగం తనను కొద్దికాలంగా భర్తతోపాటు అత్త, మరిది, తోటికోడలు మానసికంగా, శారీర కంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అజిత్‌సింగ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన అల్లూ సింహాచలం పెయింటింగ్ పని చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో భోజనం అనతరం దోమలచక్రం వెలిగించుకుని కుటుంబ సభ్యులంతా నిద్రించారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఇంట్లో మంటలు వ్యాపించడంతో సింహాచలంతో పాటు తల్లిదండ్రులు అప్పారావు, నూకాలమ్మ గాయాలపాలయ్యారు. చుట్టుపక్కల వారి సమాచారంతో 108లో ఆసుపత్రికి తరలించారు.

అత్తింటి వారిపై వేధింపుల కేసు

విద్యాధరపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి అదనంగా నగదు తీసుకురమ్మంటున్న భర్త కుటుంబ సభ్యులపై శనివారం భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. యల్లాల నాగసాయిశ్రీ (29)కి ఎనిమిదేళ్ల క్రితం యల్లాల శ్రీపృధ్వీరాజ్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.15లక్షల నగదు, 15 కాసుల బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు కానుకగా శ్రీపృధ్వీరాజ్ తల్లిదండ్రులకు అందజేశారు. పలుమార్లు పెద్దల సమక్షలో రాజీ పడినా మార్చి 25వ తేదీన భర్త మద్యం తాగి బాధితురాలిని, ఆమె కుమార్తెను కొట్టి ఇంటిలో నుంచి బయటకు పంపించివేశారు. దీంతో బాధితురాలు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది దీంతో బాధితురాలు భర్త, అత్త, మామ, మరిదిలపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి

ఇద్దరిపై కేసు

వన్‌టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): గొల్లపాలెం సాయిబాబ గుడి సమీపంలో మాడుగుల సుదర్శన్ పదో తరగతి వరకు చదివి వన్‌టౌన్‌లోని ఓ ఎలక్ట్రానిక్ షాపులో పనిచేస్తున్నాడు. అదే షాపులో ప్రశాంత్ కూడా పనిచేయటంతో ఇద్దరూ స్నేహితులయ్యారు. ఈ క్రమంలో సుదర్శన్, ప్రశాంత్ ఫొటో దిగి దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. పెట్టారు. ఆ ఫొటోను చూసిన బాల, దీలీప్ మరికొందరు షాపు వద్దకు వెళ్లి సుదర్శన్‌ను బలవంతంగా బయటకు తీసుకువచ్చి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న రౌడీషీటర్ అరెస్టు

పాయకాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న రౌడీ షీటర్‌ను శనివారం నున్న రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వాంబేకాలనీకి చెందిన పెద్దా దుర్గారావు(26) అలియాస్ కరేబియాకు పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. శనివారం కాలనీలో కరేబియా అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని పోలీసులు గుర్తించారు. అతనిని తనిఖీ చేయగా గంజాయి ఉండటాన్ని గుర్తించారు. అతని వద్ద నుంచి కేజీ 800 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు సరికాదు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ

గవర్నర్‌పేట, మే 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణత కాని పిల్లల కోసం రెమిడియల్ తరగ తుల పేరుతో ఉపాధ్యాయులను వేధిం చడం సరికాదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెమిడియల్ క్లాసుల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, ఇది ఉపాధ్యాయుల వేసవి సెలవులను నిరోధించడమే అన్నారు. ఉపాధ్యాయులను వేసవిలో వేధించడం సరికాదని, ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు వేసవి సెలవులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును కోరారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

గాంధీనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవం దాసరిభవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. తీవ్రవాదాన్ని నిరసిస్తూ ప్రతిజ్ఞ చేట్టారు. దేశ భవిష్యత్తు తీర్చిదిద్దడంలో యువత పాత్ర కీలకమని రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రగతిశీల, అభ్యుదయ బావజాలం, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలు, నైతిక విలువలు, మానవత్వాన్ని పెంపొందించేందుకు సంఘం తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నగర ప్రధానకార్యదర్శి లంకా గోవిందరాజులు, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, సీరం రవి, లాల్ మోహన్, మమత, గాడి అజయ్, ఉప్పుటూరి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీవోపై కృతజ్ఞతలు

బస్‌స్టేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు ఎదురుచూస్తున్న పదోన్నతులకు తాజాగా ప్రభుత్వం అనుమతి ఇవ్వటంపై ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య పదోన్నతులకు కూడా వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం 110 మందికి పదోన్నతులపై శుక్రవారం జీవో విడుదల చేసినట్టు వారు తెలిపారు. ఆర్టీసీలో పనిచేస్తున్న కింది స్థాయి అసిస్టెంట్ మెకానిక్‌ల నుంచి అసిస్టెంట్ మేనేజర్ క్యాడర్ వరకు పదోన్నతులు రావాల్సిన వారు ఇంకా మూడువేల మంది ఉన్నారన్నారు. వారికి కూడా తక్షణం పదోన్నతులు కల్పించాలని కోరారు.

నేటి నుంచి కుమార క్రియా యోగా శిక్షణ

సత్యనారాయణపురం, మే 3(ఆంధ్రజ్యోతి): లోటస్‌ల్యాండ్ మార్క్ సమీపంలోని వెల్ఫేర్ హాల్‌లో ఉచిత కుమార క్రియా యోగా శిక్షణ, సాధన తరగతలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నామని డి.తిరుపతిరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకూ జరుగుతాయని, 8 సంవత్సరాల నుంచి 15సంవత్సరాలు వయస్సు ఉన్న విద్యార్థులు పాల్గొన వచ్చునన్నారు. దూర ప్రాంత విద్యార్థులు జూమ్ ద్వారా జాయిన్ కావచ్చని తెలిపారు. వివరాల కోసం 9866041332లో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగ పోటీలు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండర్-9 బాలబాలికల చదరంగ పోటీలు కానూరులోని స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ప్రారం భమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలను స్కూల్ సీఈవో జాహ్నవి ప్రారంభించారు. 97మంది బాలురు, 37మంది బాలికలు పాల్గొనగా బాలుర విభాగంలో హితేష్, జస్వంత్, శశాంక్, ప్రభంజన్ నాయుడులు నాలుగు పాయింట్లతో ముందంజలో ఉన్నారు. బాలికల విభాగంలో మోదిత రెడ్డి 4 పాయింట్లు, మోక్ష సత్య ఆద్య, సహస్ర లు 3.5 పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఆదివారం మిగిలిన 3రౌండ్లు జరుగుతాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.470

శేషాచల శ్రీనివాసస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గంపలగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి): పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. రూ.35 లక్షల విరాళంతో నిర్మించిన స్వామి పవళింపు సేవా మందిరం, వంటశాల ఆలయ కార్యాలయం రాజవరానికి చెందిన దాత మన్నె నరసింహ మూర్తి కుటుంబ సభ్యులు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ పంది వెంకట్రావ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ



తిరువూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దారు గురునాథం సత్రం అనువంశిక ధర్మకర్త దారా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయం వద్ద శాంతిహోమాలు, అమ్మవారి విగ్రహనికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలో అన్నసంతర్పణ చేశారు.

లక్ష మల్లెల అర్చన



జగ్గయ్యపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో భగవద్రామానుజ గోష్టి ఆధ్వర్యంలో రామానుజుల జయంతి సందర్భంగా లక్షమల్లెల అర్చన నిర్వహించారు.

నేడు హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

మైలవరంరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగూడెం శివారు మల్లాయికుంటలో ఆదివారం భక్తహనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10.45 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి, వాయులింగ శిఖర విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

9న కౌలుకు ఆలయ భూముల వేలం

జి.కొండూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గంగినేనిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ పట్టాభిరామ స్వామి దేవస్థానానికి చెందిన 28.08 ఎకరాల భూమికి మూడేళ్లకు కౌలు వేలం పాటను ఈనెల 9న సాయంత్రం 4 గంటలకు ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఆసక్తిగల పాటదారులు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

తిరుపతమ్మకు రూ.16.62 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రీతిరుపతమ్మ అమ్మవారికి దేవస్థానం వద్ద పలు వ్యాపారాలు నిర్వహించుకునే షాపుల అద్దెల ద్వారా రూ.16,62,800లు ఆదాయంగా వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కిషోర్‌కుమార్ శనివావరం తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ఆలయ అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈ విద్యార్థుల ఇంటింటి సర్వే

మైలవరంరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): భారత్ అభయాన్‌లో భాగంగా శనివారం మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సబ్జపాడు, పర్వతాపురం గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సర్వేను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి ప్రారంభించగా, కో ఆర్డినేటర్ డాక్టర్ బి.శివహరిప్రసాద్, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

విస్సన్నపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అటవీ భూముల పరిరక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస రెడ్డి అన్నారు. కొండపర్వ గ్రామంలో ఆర్.ఎస్ నంబరు 298లోని భూములను జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే త్రివిక్రమ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అటవీ భూములను ఆక్రమించినా, దొంగిలించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల సర్వేయర్ శంకర్రావు, అటవీశాఖ అధికారి సాయి తదితరులు పాల్గొన్నారు.

నివేశన స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

తిరువూరు, మే 3(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా నివాసం ఉంటున్న స్థలాలు మాన్యం భూముల పేరుతో, నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శనివారం ఈనాం భూముల జాబితా నుంచి నివేశన స్థలాలను తొలగించాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాదు, ఆకుల రవి, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి



నిత్యం రద్దీగా ఉండే ఎన్టీటీపీఎస్ పాత గేటు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు



పైడూరుపాడు చెరువులో సేద తీరుతున్న గేదెలు

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)

భానుడు భగభగమంటున్నాడు. ఎండలు మండిపోతున్నాయి. బయట నిప్పుల కొలిమిలా ఉంటుంది. మే మొదటి వారంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉదయం 10 గంటలకే నిత్యం జన సంచారంతో రద్దీగా ఉండే పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించినట్లుగా ఉంది. జనం ఎండలకు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో ముఖ్యమైన పనుల నిమిత్తం వచ్చే జనం ఎండ వేడిమి తాళలేక శీతలపానియాల వైపు పరుగు పెడుతున్నారు. గోలి సోడా, కొబ్బరి బొండా, చెరుకు రసం, పుచ్చముక్కలు, ఫ్రూట్ జ్యూస్ తదితర వాటిని సేవిస్తూ సేదతీరుతున్నారు. ఎండలకు తట్టుకోలేక పశువులు, జీవాలు చెట్ల నీడలో, చెరువు నీటిలో సేద తీరుతున్నాయి. దాహానికి మూగ జీవాలు అల్లాడిపోతున్నాయి. కోతులు, కుక్కలు ఇలా ప్రతి ఒక్కటి తాగే నీటి కోసం వెతుకులాడుతున్నాయి. ఎండలు ఇలానే ఉంటే బయటకు రాకుండా ఉండటమే మంచిదనే అభిప్రాయాన్ని వైద్యులు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ బయటక రాక తప్పని పరిస్థితి ఉంటే సరైన జాగ్రత్తలు తీసుకొని బయటకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు.



ఇబ్రహీంపట్నంలో ఉదయం 9.45 గంటలకు నిర్మానుష్యంగా



గోలి సోడాతో గొంతు తడుపుకుంటున్న యువత

ఐదు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

వత్సవాయి, మే 3 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాలలో వత్సవాయి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఐదు జిల్లాల స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇలాంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు, పెద్ది రామారావు, చిట్టూరి రమేష్, యు.రాధాకృష్ణ, పీఈటి బాబూరావు పాల్గొన్నారు.

● ఎన్టీఆర్, కృష్ణా, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు రసవత్తరంగా 10 రోజుల పాటు జరగనున్నాయి. మొత్తం 40 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజనం, వసతి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఎం.ప్రభుదాసు, నెల్లూరు గోపి, వి.గోపిలు తెలిపారు. శనివారం పోటీల్లో ఖమ్మం జిల్లా పాలగుడుపై కన్నెవీడు టీమ్ గెలుపొందింది.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

బాధితుడికి తాతయ్య పరామర్శ

జగ్గయ్యపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలుల బీభత్సానికి కోదాడ రోడ్డులో చెట్టు కూలి పడటంతో కప్పు పూర్తిగా కోల్పోయిన సుబ్బారావు కుటుంబాన్ని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పరామర్శించారు. శనివారం తాతయ్య గాయపడ్డ సుబ్బారావును పరామర్శించారు. ఆ రోజు కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పిందని సుబ్బారావు చెప్పారు. ప్రభుత్వం నుంచి తగు సహాయం అందేలా చూస్తానని తాతయ్య హామీ ఇచ్చారు ఆయన వెంట చైర్మన్ రాఘవేంద్ర, మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, కృష్ణ, పేరం సైదేశ్వరరావు, హరీష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు

గంపలగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గంపలగూడెం, పెనుగొ లను గ్రంథాలయాల్లో శనివారం పిల్లలచే కథల పుస్త కాలు చదివించారు. కథలు చెప్పారు. చేతిరాతలో శిక్షణ ఇచ్చారు. బొమ్మలు తయారు చేయించారు. కంప్యూటర్ కీ బోర్డుపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాల సహాయకులు సుంకర నాగేశ్వరరావు, జె.శ్రీలత, టీచర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణితంపై అవగాహన

మైలవరంరూరల్: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం మైలవరం గ్రంథాలయంలో విద్యార్థినీ, విద్యార్థులకు గణితంపై ఉపాధ్యాయులు వరప్రసాద్ అవగాహన కల్పించారు. అనంతరం ఇండోర్ గేమ్స్, జంబ్లింగ్ పజిల్స్, చదరంగం పోటీలు నిర్వహించారు. బీడీసీ నిర్వాహకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై శిక్షణ

తిరువూరు: స్థానిక గ్రంథాలయంలో శనివారం ఉదయం ప్రసన్నకుమార్ స్పోకెన్ ఇంగ్లీషుపై శిక్షణ అందించగా, నాగేశ్వరరావు చిత్రలేఖనంపై శిక్షణ అందించారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయం అధికారిణి కోగంటి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పెనుగంచిప్రోలు: కొణకంచి గ్రంథాలయంలో శనివారం విద్యార్థులచే ఆట పాటలు నేర్పించారు. పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాధికారి రామచంద్రుడు, యర్రం భాస్కరరావు, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: పట్టణంలో గ్రేడ్ 1 గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో శనివారం స్పోకెన్ ఇంగ్లీష్ పై ఉపాధ్యాయుడు వినోద్ శిక్షణ ఇచ్చారు. ఆంగ్ల వ్యాకరణం, మాట్లాడే విధానంపై ఆయన అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారిణి ఆలేటి ప్రభ, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.



గంపలగూడెంలో బొమ్మల తయారీపై శిక్షణ

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి



దాడిలో గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ విష్ణు

విస్సన్నపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై ఇద్దరు యువకులు దాడి చేసి గాయపర్చిన ఘటన పుట్రేల శివారు జానలగడ్డలో శుక్రవారం జరిగింది. బాధిత డ్రైవర్ పోతుల శివ విష్ణు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ గవర్నర్‌పేట - 2 డిపోలో తాను డ్రైవర్‌గా పని చేస్తున్నానని, శుక్రవారం అమరావతిలో జరిగిన మోదీ సభకు జానలగడ్డ గ్రామం నుంచి ప్రజలను ఎక్కించుకొని వెళ్లానని, సభ అనంతరం తిరిగి జానలగడ్డకు జనాన్ని తీసుకుని వచ్చానని తెలిపారు. అదే సమయంలో జానలగడ్డ ప్రాంతంలో రామానగర్‌కు చెందిన ఇద్దరు యువకులు మోటార్ బైక్ పై వెళుతుండగా వారిని ఓవర్ టేక్ చేశానన్నారు. దీంతో ఆగ్రహించి ఆ ఇద్దరు యువకులు అవినాష్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డిలు బస్సుపై దాడి చేసి తనను గాయపర్చినట్లు చెప్పాడు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌కు గ్రామస్తులు సంఘీభావంగా నిలిచి ఇద్దరు యువకులను స్తంభానికి కట్టేసి పోలీసులకు అప్పగించారు. 108లో డ్రైవర్‌ను వైద్యం నిమిత్తం తరలించారు. డిపో మేనేజర్ సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు చింతయ్య, శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, మల్లేశ్వరరావులు డిమాండ్ చేశారు.

యూట్యూబర్ కుటుంబానికి న్యాయం చేయండి

రోడ్డుపై బైఠాయించిన బంధువులు



తిరువూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యూట్యూబర్ వేంపాటి మధుమిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమండ్ చేస్తూ ఆమె బంధువులు పట్టణంలోని గణేష్ సెంటర్‌లో శనివారం రోడ్డుపై బైఠాయించారు. విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లిలో మధుమిత అనుమానాస్పంద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటనపై నిందితుల్ని గుర్తించి కఠినంగా శిక్షించాలని బంధువులు ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారిలో ఆందోళనలో ట్రాఫిక్ స్తంభించింది. సీఐ గిరిబాబు, ఎస్సై కేవీజీవీ సత్యనారాయణలు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని కొందరు ఆందోళన కారుల్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

కేసు నమోదు

విస్సన్నపేట: తెల్లదేవరపల్లిలో యూ ట్యూబర్ వెంపాటి మధుమిత అనుమానాస్పద మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుడు కృష్ణారెడ్డి మృతి



కృష్ణారెడ్డి (ఫైల్‌ఫొటో)

మైలవరంరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్వడం గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి (66) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. గత కొంతకాలంగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన విజయవాడ, హైదరాబాద్‌లలోని ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృష్ణారెడ్డి మృతదేహానికి టీడీపీ నాయకులు కోమటి సుధాకర్ తదితరులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

వీరులపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరులో పెట్రోల్ బంక్ సెంటర్లో గుర్తు తెలియని వాహనం ఢీకొని గ్రామానికి చెందిన అంగిపోగు ముత్తయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108లో బాధితుడిని కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు.

గన్నవరం విమానాశ్రయానికి పుచ్చలపల్లి పేరు పెట్టాలి

ఇబ్రహీంపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయానికి గన్నవరం మొట్టమొదటి ఎమ్మెల్యే పుచ్చలపల్లి సుందరయ్య పేరు పెట్టాలని ఇబ్రహీంపట్నంకు చెందిన ప్రముఖ న్యాయవాది వల్లభనేని నాగపవన్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఇబ్రహీంపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు, సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, రామ్మోహన్‌నాయుడికి, లోకేష్‌కు, మంత్రి కొల్లు రవీంద్రలకు లేఖలు రాసి రిజిస్టర్ పోస్టులో పంపినట్లు తెలిపారు.

ఉత్తమ రాజధాని నగరంగా అమరావతి : శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యుత్తమ రాజధాని నగరంగా తీర్చిదిద్దే దిశలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభ సాగిందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పాల్గొన్న సభకు అశేషజనం తరలి రావటంలో రాజధానిపై ఉన్న ప్రజల అంచనాలు, ఆకాంక్షలను తేటతెల్లం చేసిందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు, చంద్రబాబు కార్యాచరణ మూడేళ్లలోనే రాజధాని నిర్మాణం పూర్తవుతుందని విశ్వాసం కల్పించిందన్నారు. నియోజకవర్గం నుంచి 20వేల మంది సభకు హాజరుకావటం ఎంతో సంతోషంగా ఉందని, కార్యక్రమం సజావుగా సాగి విజయవంతం కావటంలో పనిచేసిన మునిసిపల్ అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవాహిని విద్యార్థుల క్షేత్ర పర్యటన

తిరువూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాహిని ఇంజినీరింగ్ ఎంబీఏ, బీసీఏ, బీబీఏ విద్యార్థులు మంగళగిరివద్ద ఆత్మకూరులోని కోకోకోలా కంపెనీకి క్షేత్ర పర్యటనకు వెళ్లినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఇటువంటి విజ్ఞాన దాయక క్షేత్రప్రదర్శనలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.